క్లుప్తంగా

వెల్‌నెస్ సెంటర్ పరిశీలన



నిజామాబాద్‌నాగారం: నగరంలోని వెల్‌నెస్ సెంటర్‌ను మంగళవారం మున్సిపల్ కమిషనర్ మకరంద్, డిప్యూటీ కమిషనర్ రాజేంద్ర కుమార్ కలిసి పరిశీలించారు. సెంటర్‌లో నెలకొన్న సమస్యలను పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రామ్మోహరావు, వెల్‌నెస్ సెంటర్ కో – ఆర్డినేటర్ కృష్ణవేణి, కమిషనర్‌కు వివరించారు. త్వరలో సమస్యలు పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. నాయకులు ప్రసాద్ రావు, రాధాకిషన్, భోజారావు, చంద్రశేఖర్ ఉన్నారు.

పరీక్షలు వాయిదా వేయాలి



తెయూ(డిచ్‌పల్లి): ఈనెల 15నుంచి ప్రారంభం కానున్న పీజీ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని ఎన్‌ఎస్‌యూఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం వారు తెయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరిని కలిసి వినతిపత్రం అందజేశారు. తెయూ ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు కొమిర శ్రీశైలం మాట్లాడుతూ.. ఈ నెల 18నుంచి ఆగస్టు 8వరకు డీఎస్సీ పరీక్షలు ఉన్నట్లు తెలిపారు. వర్సిటీలోని చాలా మంది విద్యార్థులు డీఎస్సీ కోసం సన్నద్ధం అవుతున్నారని, వారి భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని పీజీ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని కోరారు. వర్సిటీ గిరిజన శక్తి విద్యార్థి సంఘ అధ్యక్షుడు శ్రీనురాథోడ్, విద్యార్థులు మహేష్, హరిత, సౌందర్య, రమ్య పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి



నిజామాబాద్‌రూరల్: గ్రామ పంచాయతీలకు నిధులను మంజూరు చేయాలని రూరల్ మండలాల జీపీ కార్యదర్శులు కోరారు. ఈమేరకు జిల్లాకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో మధురిమకు వారు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలో నిధుల కొరత ఉన్నందున కార్మికులకు, సిబ్బందికి వేతన చెల్లింపులో ఆలస్యం జరుగుతుందన్నారు. ట్రాక్టర్ ఈఎంఐలు, పలు అభివృద్ధి పనులకు నిధులు చాలడం లేదన్నారు. ఆయ గ్రామాల కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

కలుపు నివారణపై శ్రద్ధ చూపాలి



డిచ్‌పల్లి: వరిలో సరైన సమయంలో కలుపు నివారణపై శ్రద్ధ చూపడంతో మంచి దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. మండలంలోని మెంట్రాజ్‌పల్లి రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్‌లోని వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నేరుగా రైతులకు అవగాహన కల్పించారు. వరిలో స్వల్పకాలిక రకాలు, కలుపు నివారణకు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. రూరల్ ఏడీఏ ప్రదీప్‌కుమార్, ఏడీఏ ఎఫ్‌టీసీ దేవగ్లోరీ, ఏవోలు రాంబాబు, రవీందర్, ఏఈవోలు వంశీకృష్ణ పాల్గొన్నారు.

జీవో 10ని రద్దు చేయాలి

ఖలీల్‌వాడి: 65సంవత్సరాలు పూర్తయిన అంగన్‌వాడి ఉద్యోగులకు తక్కువ రిటైర్మెంట్ బెనిఫిట్ ఇస్తూ ఇంటికి పంపుతూ ఇచ్చిన జీవో నెం. 10ని వెంటనే రద్దు చేయాలని, సమ్మె ఒప్పందాలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, రిటైర్డ్ ఉద్యోగుల జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మోహన్‌రావు కోరారు. ఈమేరకు మంగళవారం నగరంలో కొనసాగుతున్న అంగన్‌వాడీల దీక్షకు వారు సంఘీభావం వ్యక్తం చేశారు. నూర్జహాన్, యూనియన్ జిల్లా కోశాధికారి చంద్రకళ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా పదివేల మంది అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్‌కు తక్కువ బెనిఫిట్ ఇచ్చి అన్యాయంగా తొలగించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గోదావరి, జగదాంబ, అరుణ, లక్ష్మి, రోజి, సునంద, గంగు, గౌరీ, లక్ష్మీబాయి, శాంతమ్మ తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ

మోపాల్: మండలకేంద్రంలో మంగళవారం ఏఎస్సై రమేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీలు చేశారు. నెంబర్ ప్లేట్, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్, ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపిస్తున్న 21 మందికి జరిమానాలు విధించారు. ఏఎస్సై మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని, నెంబర్ ప్లేట్ లేకుంటే వాహనం సీజ్ చేస్తామని హెచ్చరించారు.

గుంతల రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- నగరంలో ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్షా సమావేశం



నగరంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని నగరంలో గుంతలమయమైన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అధికారులను ఆదేశించారు. నగరంలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో మంగళవారం ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ధన్‌పాల్ మాట్లాడుతూ.. టీయూఎఫ్‌ఐడీసీ ఫండ్‌లో మిగిలిన పనులు కూడా వెంటనే పూర్తయ్యేలా చూడాలన్నారు. నూతన రోడ్లు నాణ్యతతో వేయాలని, నాసిరకంగా చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రోడ్ల మరమ్మతుల కోసం తవ్విన గుంతలను వెంటనే పూడ్చేయాలని, ఆలస్యం చేయడం వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తెచ్చారు. నాగారంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు మరమ్మతులు చేయించి, లబ్ధిదారులకు అందించేలా చూడాలని ఆదేశించారు. పాత కలెక్టరేట్ మైదానం ఉన్న స్థలంలో స్పోర్ట్స్ ట్రాక్‌ను నిర్మించాలని, ప్రభుత్వ స్థలాల్లో మినీ స్టేడియం నిర్మాణం, సోనీ ఫంక్షన్ హాల్ వద్ద బ్రిడ్జి పనులు శరవేగంగా పూర్తి చేయాలన్నారు. అర్సపల్లి ఆర్వోబీని త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అంతకుముందు ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ గజవాడ హన్మంత్‌రావు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈఈ మురళి, డీఈఈ ప్రవీణ్, ఏఈలు సాయి కుమార్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల పక్షాన పోరాటమే ఏబీవీపీ లక్ష్యం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న తెయూ రిజిస్ట్రార్ యాదగిరి, ఏబీవీపీ నాయకులు



మాట్లాడుతున్న ఏబీవీపీ జాతీయ సహ సంఘటన కార్యదర్శి బాలకృష్ణ

తెయూ(డిచ్‌పల్లి): అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఎల్లవేళలా విద్యార్థుల పక్షాన పోరాటమే లక్ష్యంగా పనిచేస్తుందని జాతీయ సహ సంఘటన కార్యదర్శి బాలకృష్ణ అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ కాలేజ్ సెమినార్ హాల్‌లో మంగళవారం ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ఏబీవీపీ ఆవిర్భవించి 75సంవత్సరాలు పూర్తి చేసుకుని ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థగా అవతరించిందన్నారు. ఇప్పటికీ 54 లక్షలకు పైగా సభ్యత్వాలతో ఏబీవీపీ దేశవ్యాప్తంగా దాదాపు 50వేల కళాశాలల్లో ప్రవేశించిందన్నారు. తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి రక్తదాన శిబిరాన్ని సందర్శించి విద్యార్థులకు జాతీయ విద్యార్థి దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఏబీవీపీ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు రెంజర్ల నరేష్, జాతీయ కార్యవర్గ సభ్యులు శివ, విభాగ్ సంఘటన మంత్రి రాజు సాగర్, నాయకులు శశిధర్, సునీల్, పావని, సాయికుమార్, అమృత్, నాగరాజు, హరికృష్ణ, సమీర్, సచిన్, అక్షయ్, ప్రవీణ్, నవీన్, మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.19,500 అందించాలి

- పారిశుధ్య కార్మికుల డిమాండ్
- మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

నిజామాబాద్‌నాగారం: నగర మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న వాటర్ సప్లయి, గార్డెన్స్, స్ట్రీట్ లైట్స్, ప్లంబర్ సహా ఇతర కార్మికులకు జీవో నెంబర్ 60 ప్రకారం రూ.19,500 కనీస వేతనం అమలు చేయాలని బీఎల్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిద్ధిరాములు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం నగరంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద బీఎల్‌టీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం మేనేజర్ జనార్దన్‌కు వినతిపత్రం అందజేశారు. సిద్ధిరాములు మాట్లాడుతూ.. నగర పాలకవర్గం జీవో నెంబరు 60 ప్రకారం కనీసం వేతనాలు ఇవ్వకుండా వారి ఇష్టానుసారంగా వ్యవహరించడం సరికాదన్నారు. మహిళ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సబ్బని లత మాట్లాడుతూ.. కార్మికులకు తక్షణమే కనీస వేతనాలు ఇవ్వాలని, లేదంటే పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. నాయకులు రాజేంద్రర్, యాదయ్య, హరీష్, మురళి, సంపత్, శంకర్, శ్రీశైలం, శంకర్, మహేందర్, నర్సింలు, రాజు, పుష్పా, రూప, గంగా పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



సిరికొండ: ఎరువులు పురుగు మందుల డీలర్లు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ విక్రయాలు జరపాలని నిజామాబాద్ రూరల్ ఏడీఏ ప్రదీప్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంతో పాటు తూంపల్లి, కొండూర్ తదితర గ్రామాల్లో మంగళవారం ఆయన సొసైటీలు, ప్రైవేటు ఫర్టిలైజర్లను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి స్టాకు వివరాలను తెలుసుకున్నారు. యూరియా కాంప్లెక్స్ ఎరువులను పీవోఎస్ యంత్రం ద్వారా విక్రయించాలని డీలర్లను ఆదేశించారు. ఏఈవో శ్రీకాంత్ ఉన్నారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	260
	(కిలోకు)	లైవ్	220
స్కిన్‌లెస్	280	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	73,000	వెండి (కిలో)	93,500
22 క్యారెట్స్	67,340		– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	32	50	గాజరుగడ్డ	30	50
బెండకాయ	35	50	పచ్చిమిర్చి	60	90
బీరకాయ	30	50	దోసకాయ	20	40
దొండకాయ	15	30	ఆలుగడ్డ	30	50
బీర్నిసుకాయ	100	130	గోబిగడ్డ	30	50
కాకరకాయ	50	75	గోబిపువ్వు	30	50
వంకాయ	10	10	బీట్‌రూట్	20	40
పాలకూర	25	50	కరివేపాకు	40	60
మెంతికూర	50	75	చామగడ్డ	35	50
కొత్తిమీర	30	50	గోరుచిక్కుడు	50	75
పుదీనా	50	75	చిక్కుడుకాయ	60	90
క్యాప్సికం	60	80			– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	కల్కి-2898 ఏడీ(తెలుగు)-12.25, 3.50,7.15
స్క్రీన్-2	కల్కి-2898 ఏడీ(తెలుగు) -10.30 కల్కి-2898 ఏడీ(3డీ తెలుగు) -2.00, 5.30,9.30
స్క్రీన్-3	కల్కి-2898 ఏడీ (3డీతెలుగు) - 4.05, 07.20, 10.45

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	కల్కి-2898 ఏడీ(3డీ తెలుగు)- 11.00, 2.45, 6.30, 10.15
స్క్రీన్-2	డెస్పి ఎబుల్ మీ4(3డీ-తెలుగు) - 11.40, 2.00, 6.30, 10.15 డెస్పి ఎబుల్ మీ4(3డీ- ఇంగ్లీష్)- 9.00
స్క్రీన్-3	ఎం.ఎస్.ధోని (హిందీ)- 11.30, 10.45 కల్కి-2898 ఏడీ(తెలుగు)-3.15, 7.00
స్క్రీన్ -4	కిల్(హిందీ)-11.15, 1.45, 8.00, 10.30 - ఎం.ఎస్.ధోని(హిందీ)- 4.15
దేవి	మహారాజ (తెలుగు)
నటరాజ్	కల్కి-2898 ఏడీ (తెలుగు)
విజయ్	కల్కి-2898 ఏడీ(తెలుగు)

శానిటేషన్ విభాగంలో మార్పులు

- ఇన్‌చార్జి శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లకు తిరిగి జవాన్‌లుగా విధులు
- ఆదేశాలు జారీ చేసిన కమిషనర్

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ మున్సిపాలిటీ శానిటేషన్ విభాగంలో మార్పులు చోటుచేసున్నాయి. గతంలో శానిటేషన్ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో అప్పటి ఇన్‌చార్జి కమిషనర్ చిత్రా మిశ్రా, సీనియర్ జవాన్‌లకు ఆయా జోన్‌లలో ఇన్‌చార్జి సానిటేషన్ ఇన్‌స్పెక్టర్లుగా విధులు నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చారు. కానీ వారు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ప్రస్తుత కమిషనర్ మంద మకరందు సీరియస్ అయ్యారు. దీంతో మంగళవారం ఆయన ఇన్‌చార్జి శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు తిరిగి యథావిధిగా జవాన్ విధులు నిర్వహించాలని ఆదేశాలు జారీచేశారు.

గాడి తప్పిన పాలన..

నిజామాబాద్ మున్సిపాలిటీలో ఆరు జోన్ కార్యాలయాలున్నాయి. ఇందులో జోన్-1(నాందేవాడ), జోన్-2(గోల్‌హనుమాన్), జోన్-3(పెద్దబజార్), జోన్-4ఏ రాజీవ్‌గాంధీ ఆడిటోరియం, జోన్-4బీ(కంఠేశ్వర్), జోన్-5(అర్సపల్లి)లున్నాయి. గతంలో ప్రతి జోన్‌కు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ విధులు నిర్వహించేవారు. శానిటేషన్‌ను మరింత చక్కదిద్దడానికి ఆయా జోన్‌లలో సీనియర్‌గా ఉండే జవాన్‌లకు అప్పటి ఇన్‌చార్జి కమిషనర్ చిత్రమిశ్రా ఇన్‌చార్జి శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లుగా విధులు నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చారు. అలాగే శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌లు ప్రభుదాస్, నటరాజ్‌గౌడ్, శ్రీకాంత్, సునీల్, మహిపాల్‌ను సర్కిల్ ఇన్‌స్పెక్టర్లుగా నియమించారు. కానీ ఇన్‌చార్జిలతో పాలనలో ఎలాంటి మార్పు రాకపోవడంతోపాటు, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు అధికారుల గుర్తించారు. ఈక్రమంలో ఏడుగురు ఇన్‌చార్జి శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు (జోన్-1, సుదర్శన్, జోన్-2 చంద్రశేఖర్, జోన్-3 గోపి, జోన్-4బి రాజేశ్వర్, జోన్-5 అబ్దుల్ రజాక్, కిషన్, నరేష్) తిరిగి జవాన్లుగా విధులు నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు.

ఆర్డర్ కాపీలు అందజేస్తాం..

ఇప్పటి ఆరుజోన్ కార్యాలయాల్లో ఇన్‌చార్జి శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లుగా విధులు నిర్వహించిన వారిని గతంలో మాదిరిగా జవాన్‌లుగా విధులు నిర్వహించాలని కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు. ఈమేరకు ఆర్డర్ కాపీలు అందజేస్తాం. వారు యథావిధిగా జోన్‌లలో జవాన్‌లుగా విధులు నిర్వహించాలి. నగరాన్ని మరింత అభివృద్ధి చేయడంలో ప్రతి ఒక్కరు బాధ్యతయుతంగా విధులు నిర్వహించాలి.

–రాజేంద్రకుమార్, డిప్యూటీ కమిషనర్

నిబంధనలు పాటించని స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా పుస్తకాలు విక్రయిస్తున్న శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం వారు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవికుమార్‌కు వినతిపత్రం అందించారు. జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్, జిల్లా అధ్యక్షుడు మహేష్, దినేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలు కల్పించాలి

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ బడుల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని అఖిలభారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్‌ఎఫ్) నాయకులు కోరారు. ఈమేరకు మంగళవారం జిల్లాకేంద్రంలోని డీఈవో కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి రఘురాం మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల సందర్శన నిర్వహించగా బడుల్లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు. జిల్లా అధ్యక్షురాలు అంజలి, నాయకులు నవీన్, వంశి, సుధాకర్ పాల్గొన్నారు.

చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు బాలుడి అప్పగింత

ఖలీల్‌వాడి: ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా మంగళవారం నిజామాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై తనిఖీలు చేస్తుండగా ఓ బాలుడు కనబడినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. బోధన్ మండలం పెంట గ్రామానికి చెందిన నరేష్ (14) ఒంటరిగా కనబడటంతో అతడిని విచారించినట్లు తెలిపారు. తన తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోయారని బాలుడి రైల్వే పోలీసులకు తెలిపారు. దీంతో అతడిని నిజామాబాద్ చైల్డ్ వెల్ఫేర్ టీమ్ అప్పగించినట్లు తెలిపారు.



రోడ్ల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న జనప్రియనగర్ కాలనీవాసులు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని ముబారక్‌నగర్ శివారులో ఉన్న జనప్రియనగర్ కాలనీలో రోడ్లు, డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు మంగళవారం కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో నిరసన తెలిపారు. అనంతరం కమిషనర్‌కు విన్నవించారు. కాలనీవాసులు మాట్లాడుతూ.. లక్ష్మీప్రియనగర్, గంగాస్థాన్-ఫేస్1 నుంచి మురుగునీరు వచ్చి జనప్రియనగర్‌కాలనీలో చేరుతుందన్నారు. రోడ్లు అధ్వానంగా ఉండడంతోపాటు, డ్రెయినేజీలు లేక మురుగునీరు నిలిచి ఉంటుందన్నారు. అధికారులు స్పందించి వెంటనే సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. అసోసియేషన్ అధ్యక్షుడు రవీంధర్‌నాయక్, గౌరవ అధ్యక్షులు రణదీష్‌శర్మ, కార్యదర్శి శ్రీనివాస్, సభ్యులు బుచ్చయ్య, గోపాల్, మల్లన్న, స్వామి తదితరులు పాల్గొన్నారు.

నియామకం

నిజామాబాద్‌నాగారం: తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నిజామాబాద్ జిల్లాకు చెందిన రచయిత, టీచర్ బానోత్ ప్రేమ్‌లాల్ నియమితులైనట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామిడీ సతీష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తనను నియామకం చేసిన రాష్ట్ర అధ్యక్షుడు సతీష్‌రెడ్డికి ప్రేమ్‌లాల్ కృతజ్ఞతలు తెలిపారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, ఈమేరకు 11న కలెక్టర్ ద్వారా సీఎంకు వినతిపత్రం పంపించే కార్యక్రమం చేపట్టినట్లు రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పండరినాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి భోజాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. హెల్త్ స్కీం సహా పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమానికి రిటైర్డ్ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కొత్త చట్టాల అమలుపై అవగాహన

ఖలీల్‌వాడి: మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ ఆధ్వర్యంలో నూతన నేర న్యాయ చట్టాల అమలు తీరుపై జిల్లా కేంద్రంలో మంగళవారం రెండోరోజు అవగాహన కార్యక్రమం కొనసాగింది. సీపీ కార్యాలయంలో సీడీటీఐ హైదరాబాద్ డైరెక్టర్ రాజశేఖరన్ వివిధ శాఖల అధికారులతో కొత్త చట్టాలపై చర్చించి వారి సందేహాలను, అభిప్రాయాలను సేకరించారు. సందేహాలను తీర్చారు. సీపీ కల్మేశ్వర్, శ్రీనివాస్, రాజేష్ కుమార్‌రు, అదనపు డీసీపీ కోటేశ్వర్‌రావ్, ఏసీపీలు రాజా వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికం

భక్తి మార్గంతోనే మానవులకు ముక్తి



డిచ్‌పల్లి: భక్తి మార్గంతోనే మానవులకు ముక్తి కలుగుతుందని వశిష్ఠ సంచార సత్సంగం వ్యవస్థాపక అధ్యక్షుడు సచ్చితానందగిరి స్వామీజీ (శారదమఠం- తడపాకల్) సూచించారు. మండల కేంద్రంలోని కాశీ విశ్వనాథ ఆలయంలో మంగళవారం శ్రీమద్భగవద్గీత 12వ అధ్యాయం భక్తి ప్రవచనంపై 105వ వశిష్ఠ సంచార సత్సంగం నిర్వహించారు. ఈసందర్భంగా భక్తి యోగంపై ప్రవచనాలు బోధించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

నేడు డిచ్‌పల్లిలో జగన్నాథ రథయాత్ర

డిచ్‌పల్లి: మండల కేంద్రంలో బుధవారం (10న) ఇస్కాన్ నిజామాబాద్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర మహోత్సవం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు సిద్ధ బలరాందాస్ తెలిపారు. డిచ్‌పల్లిలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలోని కాశీ విశ్వనాథ ఆలయం వద్ద రథయాత్ర ప్రారంభమై డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం వరకు చేరుకుంటుందన్నారు. సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 8వరకు శ్రీసీతా రామచంద్రస్వామి కల్యాణ మండపంలో భజన కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. వేడుకల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

ఘనంగా సీత్లా వేడుకలు



సిరికొండ: మండలంలోని అన్ని గిరిజన తండాల్లో మంగళవారం సీత్లా వేడుకలను గిరిజనులు ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా గిరిజనులు తండాల్లో నుంచి డప్పు వాయిద్యాలతో నైవేద్యాలను ఊరేగింపుగా తీసుకెళ్లి సీత్లా భవాని అమ్మవార్లకు సమర్పించారు. వర్షాలు బాగా కురిసి పాడిపంట చల్లగా ఉండాలని పూజలు చేశారు. మొక్కులు తీర్చుకున్నారు.

సమస్త మానవాళికి భగవద్గీత ఆదర్శం



నిజామాబాద్‌అర్బన్: సమస్త మానవాళికి భగవద్గీత ఆదర్శనీయమని బ్రహ్మశ్రీ ఫణతుల మేఘరాజ్ శర్మ తెలిపారు. నగరంలోని ఉమామహేశ్వర గుడిలో మంగళవారం ఏడోరోజు శ్రీమద్భాగవత సప్తాహం నిర్వహించారు. బ్రహ్మశ్రీ ఫణతుల మేఘరాజ్‌శర్మ భక్తులకు ప్రవచనాలు చేశారు. మనిషి నిరాశ నిస్పృహలకు లోనైనప్పుడు భగవద్గీత ఒక మార్గాన్ని చూపెడుతుందని ఆయన తెలిపారు.

